క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి


స్లాబ్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో లబ్ధిదారుడు శ్రీనివాస్ ఇంటికి స్లాబ్ వేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరై స్లాబ్ పనులను ప్రారంభించారు. మండలంలో మొదటగా శ్రీనివాస్ ఇంటికి స్లాబ్ వేశారని, ఇక మిగతా వారందరూ త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనర్సింహారెడ్డి, శ్రీను, లింగం తదితరులు పాల్గొన్నారు.

24 గంటల విద్యుత్.. ఉట్టిమాటేనా?

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కుమార్

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామానికి పేరుకు మాత్రమే నిరంతర విద్యుత్ అని అంటున్నారు.. కానీ అది ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో.. తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకుడు జంగిలి కుమార్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా నర్సప్పగూడలో విద్యుత్ సమస్య ఉందని, ఈ సమస్యను తీర్చేందుకు ఇటీవల సంబంధిత అధికారులు గ్రామానికి నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తామని కొత్త లైన్‌ను ఏర్పాటు చేశారు. కానీ వారు 24 గంటల విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి.. 24 గంటలు కూడా గడవకముందే పాత సమస్యనే పునరావృతమవుతోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నర్సప్పగూడకు నిరంతర విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నిత్యావసర సరుకుల అందజేత


యువతి తల్లిదండ్రులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న శ్రీధర్‌వర్మ

షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో నిరుపేద కుటుంబానికి చెందిన కుక్కల సత్తయ్య, లావణ్య దంపతుల కూతురు కీర్తన వివాహానికి బుధవారం ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీధర్ వర్మ రూ.10వేల విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశాడు. అనంతరం దాతకు కీర్తన తల్లితండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం యువత విభాగం ఉపాధ్యక్షుడు మంగ అశోక్, కాలనీవాసులు కురుమూర్తి, గిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉపాధ్యాయుల పదోన్నతులు

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్


అంజనేయులు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

మొయినాబాద్: రాష్ట్రంలో త్వరలో ఉపాధ్యాయుల పదోన్నతులు జరగబోతున్నాయని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వల్లూరి అంజనేయులు ఉద్యోగ విరమణ సభ బుధవారం ఠాకూర్ విజయ గార్డెన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై అంజనేయులు దంపతులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తిలో 37 సంవత్సరాల అంకిత భావంతో పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న అంజనేయులుకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, జీహెచ్‌ఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్, ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, ఎంఈఓ మల్లయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణం కలేనా?

- భారీగా వర్షాలు కురిస్తే పొంగిపొర్లుతున్న వాగులు
- ఆయా గ్రామాల మధ్య నిలిచిపోతున్న రాకపోకలు
- పట్టించుకోని అధికారులు


ఇటీవల కురిసిన వర్షాలకు పొంగిపొర్లిన బొబ్బిలిగామ వాగు

షాబాద్: మండల పరిధిలోని బొబ్బిలిగామ, కొమరబండ, మీరాపూర్, నరెడ్లగూడ, రేగడిదోస్వాడ గ్రామాల మధ్య వంతెనల నిర్మాణం కలగానే మిగిలిపోయాయి. ఈ ఐదు గ్రామాల మధ్య ఉన్న వాగులు వర్షాకాలం వచ్చిందంటే పొంగిపొర్లుతాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అంతేగాక ప్రజలు వివిధ పనులకు వెళ్లి తిరిగి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రజలకు తప్పని తిప్పలు

బొబ్బిలిగామ, కొమరబండ, మీరాపూర్, నరెడ్లగూడ, రేగడిదోస్వాడ వాగులపై వంతెనలు లేకపోవడంతో వాగులు పొంగినప్పుడు వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులు విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం షాబాద్ మండల కేంద్రానికి వెళ్లాలంటే 10 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో వాహనదారులకు అదనపు భారం పడుతుండడమే కాకుండా సమయం వృథా అవుతోంది. కాగా ఐదు గ్రామాల మధ్య వంతెనల నిర్మాణం చేపట్టాలని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో వచ్చి బ్రిడ్జి నిర్మాణాలకు కృషి చేస్తామని హామీలు ఇచ్చి పూర్తయిన తరువాత మరిచిపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చొరవ చూపి వంతెనల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



ప్రజా అవసరాల దృష్ట్యా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్న ప్రభుత్వం.. వాగుల వద్ద వంతెనలు నిర్మించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో ప్రతీ వర్షాకాలంలో తమకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి వంతెన నిర్మాణానికి కృషి చేయాలి.

–దండు యాదవరెడ్డి, బొబ్బిలిగామ

కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు

మండల పరిధిలోని కొమరబండ గ్రామ వాగుపై వంతెనకు గత ప్రభుత్వంలో రూ.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో వంతెన నిర్మాణానికి టెండర్లు వేసినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. మిగిలిన వాటికి ఇంతవరకు ప్రతిపాదనలు పంపలేదు.

–విజయ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈఈ

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

బీజేపీ గిరిజన మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌సింగ్


నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ గిరిజన మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌సింగ్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ, చింతగూడ గ్రామాల్లో పార్టీ నూతన బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తద్వారా పార్టీ గ్రామ స్థాయిలో బలోపేతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా తోట సాయికుమార్, కార్యదర్శిగా శివ, మన్‌కీ బాత్ ప్రముఖ్‌గా సాయికుమార్, చింతగూడ గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, మన్‌కీబాత్ ప్రముఖ్‌గా కిరణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు నాయకులు నూతన సభ్యులకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, చేగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేదు


లబ్ధిదారులకు రేషన్‌కార్డు ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ప్రజాప్రతినిధులు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- మండలంలో పలు భవనాల ప్రారంభం, రేషన్‌కార్డుల పంపిణీ

కేశంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేకుండా పోయిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని వేములనర్వలో అంగన్‌వాడీ భవనం, పుట్టోనిగూడలో జీపీ భవనం, అల్వాలలో మహిళా సంఘం భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా అల్వాలలో 24 గంటల విద్యుత్ సరఫరా కోసం నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్, కొత్తపేటలో ముదిరాజ్ భవనం, సుందరపురంలో జీపీ భవనాలను ప్రారంభించారు. కేశంపేటలో యెన్నం సుమిత్రమ్మ జ్ఞాపకార్థం ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 2,200ల నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని.. అందులో భాగంగానే గ్రామాల్లో రేషన్ కార్డులను అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క రేషన్‌కార్డు కూడా అందించలేకపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, విద్యుత్ ఏఈ ఈశ్వర్, పార్టీ మండల అధ్యక్షులు గూడ వీరేశ్, జగదీశ్వర్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాలశ్రావణ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపనకే పరిమితమా?

బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి


ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కొందుర్గు: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపనకే పరిమితమా అంటూ బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో ఆ స్కూల్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేసిన స్థలాన్ని బుధవారం పలువురు నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యంత అట్టహాసంగా ముఖ్యమంత్రి భూమిపూజ చేసిన పాఠశాల నిర్మాణమే నేటికీ ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. ఇక రాష్ట్రంలో అభివృద్ధి పనుల తీరు ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్యగౌడ్, బోయ శంకర్, బల్వంత్‌రెడ్డి, శివారెడ్డి, అశోక్, సురేష్ పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్ పాదయాత్రకు తరలిరావాలి

మొయినాబాద్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేపడుతున్న పాదయాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కాలె శ్రీకాంత్ కోరారు. బుధవారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వికారాబాద్ జిల్లా పరిగిలో మొదలవుతుందన్నారు. పార్టీ బలోపేతానికి.. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపడుతున్న ఈ పాదయాత్రకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం పిలుపునిచ్చారు.

పాత పెన్షన్ విధానం తీర్పుపై హర్షం

చేవెళ్ల: డీఎస్సీ–2003 నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు పాత పెన్షన్ పథకానికి అర్హులేనని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పాత పెన్షన్ పోరాట సమితి మాజీ అధ్యక్షుడు గణపురం సురదీర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైకోర్టు మంగళవారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల పాత పెన్షన్ పథకం అమలు చేయాలని తీర్పునిచ్చిందన్నారు. 2004 ఆగస్టు 31 వరకు అమలులో ఉన్న పాత పెన్షన్ పథకాన్ని డీఎస్సీ 2003 నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు అమలు చేయకపోవటం చట్ట విరుద్ధమని హైకోర్టు పేర్కొందన్నారు. ఈ పథకం అమలుకు 15 ఏళ్ల పోరాటం అనంతరం ఈ తీర్పు రావటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ తీర్పు ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం, జీపీఎఫ్ ఖాతాలు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. దీంతో ఉపాధ్యాయులందరికీ మేలు జరుగుతుందన్నారు.

పెన్షన్‌దారుల సభను జయప్రదం చేయాలి

శంకర్‌పల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆగస్టు 2న చేవెళ్లలో నిర్వహించే పెన్షన్‌దారుల సన్నాహక సభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేయగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలో నిర్వహించే సన్నాహక సభకు వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వస్తున్నారని, గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు, పెన్షన్‌దారులు

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

షాద్‌నగర్: బంజారా భవన నిర్మాణానికి గత ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, ఆ స్థలాన్ని కాపాడాలని కోరుతూ బుధవారం గిరిజన సంఘాల నాయకులు ఫరూఖ్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని గుండ్లకుంట గ్రామ శివారులో గత ప్రభుత్వం బంజారా భవన నిర్మాణానికి ఎకరా భూమిని కేటాయించిందని పేర్కొన్నారు. అదేవిధంగా భవన నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలతో అంచనా వ్యయాన్ని తయారు చేసినట్లు తెలిపారు. కానీ గుర్తుతెలియని కొందరు వ్యక్తులు భవనానికి కేటాయించిన భూమిని కబ్జా చేశారని, అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మంగులాల్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ గిరిజన ఆదివాసీ సంఘం జిల్లా చైర్మన్ శ్రీనునాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్, నాయకుడు బాలునాయక్ ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

సీపీఐ మండల కార్యదర్శి శ్రీశైలం


మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

షాబాద్: సీపీఐ జిల్లా 17వ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 2వ తేదీన మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆధ్వర్యంలో 17వ మహాసభలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ ప్రముఖులు హాజరవుతున్నారని, కావున అన్ని మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రజా సంఘాలను బలోపేతం చేయడానికి, ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల కోసం భవిష్యత్ కార్యాచరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల మాజీ కార్యదర్శి జంగయ్య, పార్టీ మండల కౌన్సిల్ సభ్యులు రఘురాం, మధు, నారాయణ, రుక్కయ్య తదితరులు ఉన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

షాబాద్: మండల పరిధిలోని బోడంపహాడ్, మన్మర్రి గ్రామాలకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో రైతులు, వాహనదారులు అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్నారు. పాలకులు స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.


బోడంపహాడ్ గ్రామానికి వెళ్లే రోడ్డు పరిస్థితి

ఆర్థికసాయం అందజేత

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పటేల్‌రోడ్డులో నివాసం ఉంటున్న పండ్ల వ్యాపారి బాలమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పండ్ల వ్యాపారుల సంఘం నాయకులు బుధవారం బాలమణి కుటుంబ సభ్యులకు రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎండీ.వసీం, ఉపాధ్యక్షులు మీదిపేట రాజశేఖర్, ఎండీ.మతిన్, ప్రధాన కార్యదర్శి ఎండీ.రహమత్‌జానీ, కార్యదర్శి అజీం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

శంషాబాద్ విభాగ్ హాస్టల్ కన్వీనర్ శ్రీకాంత్

షాబాద్: వసతి గృహాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని శంషాబాద్ విభాగ్ హాస్టల్ కన్వీనర్ బర్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు వసతి గృహాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం మెనూ ప్రకారం అందజేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. మరుగుదొడ్లు, తాగునీటి సమస్య ఉందని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. వసతి గృహాల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయని విద్యార్థులు చెప్పడంతో.. వార్డెన్‌తో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మధు, కిరణ్, అజయ్ తదితరులు ఉన్నారు.

పీవీఆర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

శంకర్‌పల్లి: పట్టణంలోని పీవీఆర్ కన్‌స్ట్రక్షన్ నిర్మిస్తున్న భవనం 5వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి సంతోష్ అనే వ్యక్తి మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే బుధవారం సీఐటీయూ నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని, పరిశీలించి, కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. యాజమాన్య నిర్లక్ష్య వైఖరితోనే కార్మికుడు మృతి చెందాడని, వారి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మిక శాఖ అధికారులు నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించి, యాజమాన్యాలు కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలను గూర్చి తనిఖీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, శ్రీనివాస్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు అవసరం

మండల పశువైద్యాధికారి అహ్మద్


మొయినాబాద్: చిలుకూరులో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి అహ్మద్


షాబాద్: దామర్లపల్లిలో గొర్రెలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

మొయినాబాద్: రైతులు పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు, మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామాల్లో బుధవారం గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో జీవాలకు నీలి నాలిక వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆ వ్యాధి నివారణకు ముందస్తుగానే టీకాలు వేయించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా టీకాలు వేస్తున్నామని.. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చిలుకూరులో 1249, అమ్డాపూర్‌లో 413 జీవాలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యురాలు దేవిరెడ్డి, సిబ్బంది ప్రసన్నకుమార్, భీమ్‌రావు, గోరెమియా తదితరులు పాల్గొన్నారు.

నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

షాబాద్: గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కేసారం, దామర్లపల్లి గ్రామాల్లో జీవాలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొండారెడ్డిపల్లిలో 1135 జీవాలకు టీకాలు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో బుధవారం గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి నివేదిత పాల్గొని 1135 గొర్రెలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 8 వరకు సిబ్బందితో కలిసి టీకాలను వేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజీవ్ ఫైలెట్, స్వప్న, సామయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.